క్లుప్తంగా

నియామక పత్రాల అందజేత


నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: అంగన్‌వాడీ కేంద్రాల సహాయకులుగా ఎంపికైన వారికి నియామక పత్రాలను ఎమ్మెల్యే రెడ్డి శాంతి తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులు, బాలింతలను సక్రమంగా చూసుకోవాలన్నారు. మెళియాపుట్టి మండలం సుందరాడ, పదనాపురం, మెళియాపుట్టి, పాతపట్నం మండలం బగదల కేంద్రాల సహాయకులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో భ్రమరాంబిక, సూపర్‌వైజర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఒకటి నుంచి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న వీవీఎస్ నారాయణ

జలుమూరు: ఫిబ్రవరి ఒకటి నుంచి ఐదో తేదీ వరకు తిలారు జంక్షన్‌లో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఏకసభ్య కమిటీ ధర్మకర్త వీవీఎస్ నారాయణ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఒకటో తేదీన భీష్మ ఏకాదశి, రెండున ప్రత్యేక పూజలు, అర్చనలు, మూడున స్వామివారి కల్యాణంతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ పెద్దలు నిర్ణయించారు.

సచివాలయ ఉద్యోగుల సంఘంలో సముచిత స్థానం


దుర్గా ప్రసాదు


అలేఖ్య

సరుబుజ్జిలి: గ్రామ సచివాలయం ఉద్యోగుల సంఘంలో మండలానికి చెందిన ఉద్యోగులకు సముచిత స్థానం లభించింది. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రావివలస పంచాయతీ కార్యదర్శి దాసరి దుర్గాప్రసాదు, జాయింట్ సెక్రటరీగా సింధువాడ సచివాలయం మహిళాసంరక్షణ కార్యదర్శి జెమ్మాన అలేఖ్య శుక్రవారం ఎంపికయ్యారు.

కంటి వ్యాధులపై జాగ్రత్తలు అవసరం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆమదాలవలస రూరల్: కంటి వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని ఆప్తాల్మిక్ అధికారి రాబోవు రవిశంకర్ అన్నారు. రామచంద్రాపురం పంచాయతీ పొన్నాంపేటలో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 60 ఏళ్లు దాటిన వారందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ చల్లా ఉష, ఏఎన్ఎం ఎం.ధనలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుస్తులు అందజేత


దుస్తులను పంపిణీ చేస్తున్న సంఘ పెద్దలు

పొందూరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక పట్టుశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వంద నిరుపేద కుటుంబాలకు వస్త్రాలను పంపిణీ చేశారు. స్థానిక పట్టుశాలి సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో శుక్రవారం చేపట్టిన ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు డీవీఎస్ ప్రకాశరావు, జి.సత్యారావు, పి.సూర్యప్రకాశరావు, కోరుకొండ సాయికుమార్, మన్మథరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు..


దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: స్థానిక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఖాకీ దుస్తులు, సబ్బులు, ఆయిల్, చెప్పులు, షాంపూలను సర్పంచ్ బూరల్లి శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. పంచాయతీ నిధులతో వంద మంది కార్మికులకు వీటిని అందజేశామని సర్పంచ్ చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కేసీహెచ్‌బీ గుప్త, పి.కృష్ణప్రసాద్, బీఎల్ శర్మ, ఎంపీటీసీ సభ్యుడు వైశ్యరాజు కేశవరాజు, నాయకుపు గనగళ్ల శ్రీను, పంచాయతీ ఈవో కొత్తపల్లి సింహాద్రి ఉన్నారు.

మార్కెట్లకు సంక్రాంతి శోభ


కొత్తూరు: రద్దీగా ఉన్న కొత్తూరు ప్రధాన రోడ్డు

- కిటకిటలాడిన దుకాణాలు
- రద్దీగా మారిన రోడ్లు


కొత్తూరు: కొత్తకుండలు కొనుగోలు చేస్తున్న జనం


కొత్తూరు: కిటకిటలాడుతున్న ఓ వస్త్ర దుకాణం


నరసన్నపేట: వైఎస్సార్ కూడలి వద్ద మారుతీనగర్‌కు వెళ్లే మార్గంలో నిలిచిన వాహనాలు


నరసన్నపేట: కాలేజీ రోడ్డులో వాహనాల రద్దీ


హిరమండలం: జనాలతో రద్దీగా ఉన్న హిరమండలం ప్రధాన రహదారి

నరసన్నపేట/హిరమండలం/కొత్తూరు: మార్కెట్లు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. పెద్ద పండుగకు కేవలం ఒకరోజు మాత్రమే గడువు ఉండడంతో శుక్రవారం నరసన్నపేట, హిరమండలం, కొత్తూరు మండల కేంద్రాలు వివిధ వస్తు సామగ్రి కొనుగోలుకు వచ్చిన వారితో కిటకిటలాడాయి. ప్రముఖ వ్యాపార కేంద్రమైన నరసన్నపేటలో ప్రధాన రోడ్లు జనంతో కిక్కిరిసిపోయాయి. వాహనాల రాకపోకలకు ఎక్కడికక్కడ ఆటంకాలు కలిగాయి. ప్రధానంగా వైఎస్సార్ కూడలి వద్ద మారుతీనగర్ వైపునకు వెళ్లే మార్గంలో వాహనదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. కాలేజీ రోడ్డులో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అన్ని పట్టణాల్లో కూడా వస్త్ర దుకాణాలు, కిరాణా షాపులు, సూపర్ మార్కెట్లు జనంతో నిండిపోయాయి.

- హిరమండలం మార్కెట్ ప్రధాన రహదారి జనాలతో కిటకిటలాడింది. ఇక్కడ ఫుట్‌పాత్ వ్యాపారం జోరుగా సాగింది. ఎల్.ఎన్.పేట, హిరమండలం మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు దుస్తులు, నిత్యావసరాలు, పూజాసామాగ్రి, పూలు కొనుగోలు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఎస్‌బీఐ వరకూ జనాలు అధికంగా ఉన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో స్థానిక ఎస్సై జి.నారాయణ స్వామి ఆధ్వర్యంలో పోలీసులు క్రమబద్ధీకరించారు.
- కొత్తూరు మార్కెట్ కూడా జనంతో రద్దీగా మారింది. కొత్తూరు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా భామిని, సీతంపేట మండలాలతో పాటు ఒడిశాకు చెందిన పలు గ్రామాలకు కొత్తూరు మార్కెట్ ప్రధాన కేంద్రం కావడంతో జనం సామగ్రి కొనుగోలుకు భారీగా తరలివచ్చారు. కొత్తూరులోని నాలుగు రోడ్ల కూడలి కొనుగోలుదారులతో నిండిపోయింది.

జగనన్నే మళ్లీ.. మళ్లీ గెలవాలి


ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్న లక్ష్మమ్మ

- 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో లబ్ధిదారుల స్పష్టీకరణ
- మెట్టూరు బిట్–1 పునరావాస కాలనీలో కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: ముఖ్యమంత్రిగా జగనన్నే మళ్లీ..మళ్లీ గెలవాలని కొత్తూరు మండలం మెట్టూరు బిట్–1 పునరావాస కాలనీ వాసులు ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఎదుట తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని శాసనసభ్యురాలు తెలియజేస్తుండగా పలువురు లబ్ధిదారులు ఆనందంతో తమకు చేకూరిన లబ్ధిని వివరించారు. వృద్ధురాలు టి.లక్ష్మమ్మతో పాటు పలువురు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. దీనికి పలువురు స్పందిస్తూ మెట్టూరు బిట్–1 పంచాయతీ పరిధిలోని కొన్ని వీధులకు మంచినీరు అందడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తక్షణమే సమస్య పరిష్కరించాలని సచివాలయ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.బాల, ఈవోపీఆర్డీ కృష్ణారావు, వీఆర్వో కలమట రమేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, పార్టీ నాయకులు బూర్లె శ్రీనివాసరావు, కృష్ణారావు, బర్రి గోవిందరావు, రాజారావు, మొజ్జాడ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

హిరమండలం: చొర్లంగి గ్రామంలోని కోదండరామాలయం 12వ వార్షికోత్స మహోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్న వితరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.లక్ష్మి, వైస్ ఎంపీపీ వంగపల్లి సావిత్రి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, డైరెక్టర్ అల్లు శంకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు టి.మురళీధర్, చిరంజీవులు, చిన్నారావు పాల్గొన్నారు.

మంత్రి ధర్మానను కలిసిన ఆఫ్‌షోర్ నిర్వాసితులు


వినతిపత్రం పరిశీలిస్తున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మెళియాపుట్టి మండలం చీపురుపల్లి పంచాయతీ పరిధిలో సుమారు రెండు వందల మంది నిర్వాసితులు సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు వల్ల తమ గ్రామాల్లో ఉన్న భూమి, ఇళ్లు, సర్వం కోల్పోయామన్నారు. గత టీడీపీ హయాంలో పల్లం భూమికి రూ.2,25,000, మెట్టభూమికి రూ.1,80,000 ప్యాకేజీ ఇచ్చారని తెలిపారు. ఈ ప్యాకేజీ చాలామందికి అందలేదన్నారు. 350 మందికి ఇళ్ల స్థలం కూడా ఇవ్వలేదని చెప్పారు. ఆఫ్‌షోర్ పూర్తయ్యేవరకూ 18 ఏళ్లు నిండిన వారికి కూడా ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. అనంతరం మంత్రి స్పందిస్తూ వచ్చే నెలలో కలెక్టర్ సమీక్ష సమావేశం ఉందని, విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్తానని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో ప్రెసిడెంట్ యవ్వారి ఈశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ పిట్ట సవరయ్య, తెప్ప శ్యామసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో సంక్రాంతి సంబరాలు రేపు

నరసన్నపేట: కళింగకోమట్ల యువజన సంఘం ఆధ్వర్యంలో నరసన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం సాయంత్రం ఆరు గంటల నుంచి సంక్రాంతి సంబరాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని సంఘ ప్రతినిధులు పొట్నూరు సాయిబాబు, సాయి ప్రసాద్, బోయిన బాలకృష్ణలు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని కళింగ కోమట్లందరూ ఆహ్వానితులేనన్నారు. కొత్తగా వివాహమై అత్తవారిళ్లకు వచ్చే అల్లుళ్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

గార్లపాడులో ముగ్గుల పోటీలు

ఎల్.ఎన్.పేట: సంక్రాంతి రోజైన ఆదివారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గార్లపాడు పునరావాస కాలనీలోని గాంధీ పార్కు వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు నార శంకరరావు తెలిపారు. ఒక ముగ్గుని ఒకరు మాత్రమే వేయాలని, రంగులు వారే తెచ్చుకోవాలన్నారు. పది అందమైన ముగ్గులకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే ఆసక్తి ఉన్న వారు పార్కులో నాటేందుకు మొక్కలు తీసుకొని రావాలన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత గుల్లవానిపేట



గుల్లవానిపేట జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

నరసన్నపేట: తామరాపల్లిలో 11 రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. ఫైనల్ మ్యాచ్ పోలాకి మండలం గుల్లవానిపేట, నరసన్నపేట మండలం బొరిగివలస జట్ల మధ్య జరగ్గా.. గుల్లవానిపేట విజేతగా నిలిచింది. ముందు బ్యాటింగ్ చేసిన గుల్లవానిపేట పది ఓటర్లలో ఐదు వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. 81 పరుగుల లక్ష్యంతో బరిలోనికి దిగిన బొరిగిలస పది ఓవర్లు ముగిసే సరికి ఎనిమిది వికెట్లు నష్టపోయి 60 పరుగులు మాత్రమే చేసింది. నిర్వాహకులు శివ, అనిల్, వాసు, విస్సు, తవిటినాయుడు, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. టోర్నీలో 44 జట్లు తలపడ్డాయన్నారు. విజేతలకు గ్రామ పెద్దలు ముచ్చ గనేష్, చింతు మోహనరావు, లావేటి మురళి ట్రోఫీని అందజేశారు.

వెటర్నరీ అసిస్టెంట్‌కు సత్కారం


రవికుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సారవకోట: కుమ్మరిగుంట సచివాలయంలో పనిచేస్తున్న విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్ ఎస్.రవికుమార్‌ను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కార్యాలయ, సచివాలయ సిబ్బంది సత్కరించారు. రవికుమార్‌ను జిల్లా గ్రామ, వార్డు సచివాలయం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించడంతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ప్రసాదరావు, మండల సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వేణుగోపాలరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సంక్రాంతి సంబరాలు


జేబీటీ పాఠశాల ఆవరణలో వేసిన భోగి మంట

సారవకోట: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కేశవలస, సారవకోట, లక్ష్మీపురం, వెంకటాపురం తదితర కేంద్రాల ఆవరణల్లో రంగవల్లికలు, భోగి మంటలు వేశారు. కొత్త బియ్యంతో పాయం చేసి కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు అందజేశారు. అవలింగి జేబీటీ పాఠశాల ఆవరణలో డైరెక్టర్ మోహనగాంధీ ఆధ్వర్యంలో విద్యార్థులు భోగి మంట వేశారు.

సత్యసాయి సేవాసమితి కన్వీనర్‌గా శ్రీనివాసరావు


శ్రీనివాసరావును అభినందిస్తున్న సమితి ప్రతినిధులు

పాతపట్నం: పాతపట్నం సత్యసాయి సేవాసమితి మందిరం నూతన కన్వీనర్‌గా నాగులపల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న సత్యసాయి మందిరంలో శుక్రవారం జరిగిన ఎన్నిక ప్రక్రియలో జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు సమక్షంలో శ్రీనివాసరావును నియమించారు. ఈయనను పాతపట్నం జోనల్ కన్వీనర్ రమణమూర్తి, మాజీ కన్వీనర్ బోయిన సత్యనారాయణ, పి.చిన్నారావు, సుదర్శనరావు, రామరాజులు అభినందించారు.

పారిశుద్ధ్యంపై అవగాహన

సరుబుజ్జిలి: పారిశుద్ధ్య నిర్వహణ వలన కలుగు ప్రయోజనాలపై రావివలస సర్పంచ్ వండాన కృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి చెత్తకుప్పలు, వ్యర్థపదార్థాలు ఎక్కడపడితే అక్కడ వేయవద్దని, ఆరోగ్యసూత్రాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి భవ్యశ్రీ, హెల్త్‌అసిస్టెంట్ భూషణరావు, ఏఎన్ఎం అరుణ, ఎంఎల్‌హెచ్‌పీ రాజ్యలక్ష్మి, ఆశవర్కర్లు భవాని, రూపావతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు వితరణ


వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న గోవిందరావు తదితరులు

హిరమండలం: హిరమండలం మేజర్ పంచాయతీ పరిధి పెద్దకోరాడలోని ప్రేమసాయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శ్రీకాకుళం నగరానికి చెందిన గ్రేస్ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు సంక్రాంతి సందర్భంగా నూతన వస్త్రాలను శుక్రవారం అందజేశారు. అలాగే ఆమదాలవలసకు చెందిన బొత్స అప్పలస్వామి తన భార్య సుబ్బలక్ష్మి జ్ఞాపకార్థం ఆశ్రమవాసులకు సుమారు రూ.10 వేలు విలువైన నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షుడు మెండ గోవిందరావు మాట్లాడుతూ.. ఆశ్రమ అభివృద్ధిలో తమను భాగస్వాములు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆశ్రమ అభివృద్ధికి తమవంతు సహకరిస్తామన్నారు. ఆశ్రమ అభివృద్ధి కోఆర్డినేటర్ సాయిబాబా, కమిటీ సభ్యులు సురేష్, చగోవిందశర్మ మేనేజర్ జయరామ్ ఉన్నారు.

పవన్‌కల్యాణ్ చిల్లర మాటలు మానుకోవాలి


మాట్లాడుతున్న శ్రీకాంత్

పాతపట్నం: ఉత్తరాంధ్ర భౌగోళిక పరిస్థితులు తెలియజని జనసేన పార్టీ నాయకుడు పవన్ కల్యాణ్ చిల్లర మాటలు మానుకోవాలని తూర్పు కాపు సంక్షేమ సంఘం చైర్మన్ మామిడి శ్రీకాంత్ హితవు పలికారు. స్థానిక ఆస్పత్రి కూడలిలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నిజజీవితంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రియల్ హీరో అన్నారు. పవన్‌కల్యాణ్‌కి వైఎస్సార్‌సీపీని విమర్శించే అర్హత లేదన్నారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు తూలుగు భుజింగరావు, గూనపు శ్రీనివాసరావు ఉన్నారు.

యువకుల శ్రమదానం

నరసన్నపేట: ఆ యువకులు ఆదర్శంగా నిలిచారు. సంక్రాంతి పండుగకు సుదూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా శ్రమదానంతో పరిసరాలను బాగు చేశారు. మడపాం పంచాయతీ కొత్తపేటకు చెందిన యువకులు చేయిచేయి కలిపి వీధులను శుక్రవారం పరిశుభ్రం చేశారు. వీధుల్లో నిలిచిపోయిన మురుగునీరు బయటకు తరలించారు. రోడ్డును బాగు చేశారు. పాండురంగ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో యువకులు శ్రమదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు కె.రాజేశ్వరరావు, టి.నరేష్, పి.సంతోష్, వై.ఎర్రన్నాయుడు, టి.రమేష్ పాల్గొన్నారు.

మాకవరంలో వైద్య శిబిరం

కొత్తూరు: కురిగాం పీహెచ్‌సీ పరిధి మాకవరంలో ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీలత 42 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలి డాక్టర్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమములో ఈవో బుజ్జిబాబుతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయి..


మెళియాపుట్టి: పెద్దలక్ష్మీపురం జిల్లాపరిషత్ పాఠశాలలో 1979 నుంచి 1985 వరకు చదువుకున్న పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు లింగాల సంజీవరావు


సరుబుజ్జిలి: పురుషోత్తపురం జెడ్పీ ఉన్నత పాఠశాల 1990-91 విద్యా సంవత్సరంలో చదువుకున్న టెన్త్ విద్యార్థులు


పొందూరు: కింతలి పీఎల్ఎన్ జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యా సంవత్సరంలో చదువుకున్న పదో తరగతి పూర్వవిద్యార్థులు


జలుమూరు: గురువులతో కేవీఎన్‌జీహెచ్ 2002-03 బ్యాచ్ విద్యార్థులు


పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న 1990లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు

స్నేహితుల క్రితం కలిసి చదువుకున్న వారంతా శుక్రవారం కలుసుకున్నారు. విద్యనభ్యసించిన పాఠశాలలనే వేదికగా చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి రోజులను గుర్తు చేసుకొని మురిసిపోయారు. చిన్న పిల్లల్లా స్నెప్పులేశారు. కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కలిసి భోజనాలు చేశారు. మరణించిన తోటి విద్యార్థుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ మౌనం పాటించారు. చదువు నేర్పించిన గురువులను సత్కరించి గౌరవించారు. గ్రూపు ఫొటోలు తీసుకొని మురిసిపోయారు. చదువుకున్న బడి బాగు కోసం అండగా ఉండాలని నిర్ణయించారు.